రేషన్ బియ్యం పట్టివేత

బెజ్జూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని గొల్లవాడలో ఎండీ సల్మాన్‌ఖాన్ అనే వ్యక్తి మంగళవారం ఆటోలో తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్, గిర్దావర్ సంతోష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి బియ్యంను స్వాధీన పర్చుకుని నిందితుడిపై 6(ఎ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కౌటాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో తెలగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ అధికారులు రాజ్‌దేవ్, హరీష్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల వల్ల కలిగే లాభాలు, మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ రమేష్, ఆబీఓ ఆఫీసర్ సురేష్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎఫ్‌డీఎల్‌సీ కన్వీనర్‌లు, వీఓ అధ్యక్షులు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, సభ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

జైనూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్రికెట్ మైదానంలో బుధవారం కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రి సహకారంతో గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని జైనూర్ ఎస్సై సాగర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె నొప్పి, క్యాన్సర్ తదితర వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహిసారని చెప్పారు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిలిచిన 'ఉపాధి' కార్డులు



కూలీల వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డుల జారీని రాష్ట్రం ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో కొత్త దరఖాస్తుల పరిశీలనకు అడ్డుకట్ట పడింది. ఇప్పటికే ఉన్న జాబ్‌కార్డుల్లోనూ సవరణకు అవకాశం కల్పించడం లేదు.

- తాత్కాలికంగా జారీ చేయడం లేదని అధికారుల వెల్లడి
- 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'తో పెరిగిన డిమాండ్
- పెండింగ్‌లో కొత్త దరఖాస్తుల పరిశీలన
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డుల జారీని ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో కొత్త దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ పడింది. దీంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధికీ నోచుకోక, ఇటు ఉపాధిహామీ పనులు లభించక నిరుపేదల అవస్థలు పడుతున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుతో గ్రామాల్లో ఉపాధిహామీ జాబ్ కార్డులకు డిమాండ్ పెరిగింది. కాగా తాత్కాలికంగా కొత్త జాబ్ కార్డులు జారీ చేయవద్దంటూ ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. కొన్ని రోజులుగా నూతన జాబ్ కార్డులతో పాటు సవరణ, తొలగింపులు నిలిపివేశారు. దీంతో కొత్తగా దరఖాస్తు చేసినవారు ఇన్నాళ్ల పని చేసిన వారు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ భూమి లేని వారికి..

వ్యవసాయ భూమి లేని వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింప జేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద ఏటా 12 వేల రూపాయలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మొదటి విడతగా ఆరు వేల రూపాయలు జమచేసింది. మిగతా లబ్ధిదారులకు మార్చి 31 లోగా జమచేస్తామని చెప్పింది. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే ఏడాదిలో కూలీలు కనీసం 20 రోజులు ఈ జాబ్‌కార్డుపై పని చేయాల్సి ఉండాలి. ఇందు కోసం చాలా మంది పేదలు జాబాకార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,23,035 మందికి జాబ్‌కార్డులు ఉయ్యాయి. ఇందులో 91,721 జాబ్‌కార్డులు అక్టివ్‌గా ఉన్నాయి. 2,43,965 మంది కూలీలు ఉండగా ఇందులో 1,70,268 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు.

జాబ్‌కార్డు జారీ ఇలా..

ఉపాధిహామీ కూలీలు పనులు కోసం దరఖాస్తు చేసుకుంటే సిబ్బంది 15 రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలి. ధ్రువీకరణ పూర్తి కాగానే అర్హులైన కూలీలకు గ్రామ పంచాయతీ స్థాయిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది జాబ్‌కార్డును జారీ చేస్తారు. ఏడాదిలో ఎప్పుడైనా కూలీలు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ, బ్యాంకు పాసుపుస్తకం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఇస్తే చాలు. వెంటనే జాబ్‌కార్డులు జారీ చేస్తారు. జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఐదు కిలోమీటర్ల దూరంలో ఎక్కడైనా ఉపాధి హామీ పనులకు హాజరు కావొచ్చు. జాబ్‌కార్డు ఆధారంగా పనులకు హాజరయ్యే కూలీలకు 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లిస్తారు.

తాత్కాలికంగా నిలిపివేత..
- చంద్రశేఖర్, ఆసిఫాబాద్ ఏపీవో



ఉపాధిహామీ పథకంలో కొత్త జాబ్‌కార్డుల జారీని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలిపివేశాం. కొత్తగా దరఖాస్తులు తీసుకుంటాం. ఉన్నతా ధికారుల ఆదేశాల అనంతరం పరిశీలించి మంజూరు చేస్తాం.

గ్రూప్-2లో 19వ ర్యాంకు



శ్రీరాం శివకృష

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గ్రూపు-2 ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరాం శివకృష్ణ రాష్ట్రంలో 19వ ర్యాంకు పొందాడు. టీజీపీఎస్సీ ఫలితాల్లో 412.050 మార్కులు సాధించి ర్యాంకు పొందాడు. శివకృష్ణ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరాం సత్యనారాయణ-వాణీశ్రీ దంపతుల పెద్ద కొడుకు శివకృష్ణ గతంలో సింగరేణిలో నిర్వహించిన ఉద్యోగానికి 12వ ర్యాంకు సాధించి కాసిపేట గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. అనంతరం గత సంవత్సరం ప్రకటించిన గ్రూపు-4 ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆడిట్ సెక్షన్‌లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నాడు. తాజాగా గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్రంలో 19వ స్థానం సాధించడంతో పలువురు అభినందించారు. శివకృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రూపు-1 సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ప్రతిభ చాటిన యువకులు



సాయిరాంగౌడ్, కామ్రే భాస్కర్

కౌటాల/రెబ్బెన, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కౌటాల, రెబ్బెన మండలాలకు చెందిన యువకులు గ్రూపు-2 ఫలితాల్లో ప్రతిభ చాటారు. కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన సాయి రాంగౌడ్ గ్రూపు-2 ఫలితాల్లో 191 ర్యాంకు సాధించాడు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సాయిరాంగౌడ్ 191 ర్యాంకు సాధించడంతో పలువురు అభినందించారు. సాయిరాంగౌడ్ తల్లిదండ్రులు రాజేశం- తారక్క వ్యవసాయ చేస్తూ కుమారుడిని చదివించారు. ప్రస్తుతం సాయిరాంగౌడ్ బెజ్జూరు మండలం మొగవెల్లి కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన కామ్రే భాస్కర్ గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 229 ర్యాంకు సాధించారు. భాస్కర్ 381 మార్కులు సాధించడంతో పలువురు అభినందించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ సూర్యప్రకాష్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈ సూర్యప్రకాష్ అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులతో పాటు అధికారులతో పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేసే పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా చేపట్టినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. రానున్న రోజుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పరీక్షించిన తరువాతనే బిల్లుల చెల్లించనున్నామని తెలిపారు. పనులు పూర్తి చేయడంలో అలసత్వం వహించకూడదని సూచించారు. సమావేశంలో డీఈ కృష్ణ, అన్ని డివిజన్‌ల డీఈలు, ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

తిర్యాణి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెగురైన విద్య ను అందించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం తిర్యాణి మండలంలోని రాంబాయిగూడ మండల పరిషత్ పాఠశాలతో పాటు మాణిక్యాపూర్ కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సంద్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా బోధించాలని చెప్పారు. ఆయన వెంట ఎస్‌వో స్వప్న, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో పద్మశాలిగా జన్మించిన కొండాలక్ష్మణ్‌బాపూజీ పేరును వైద్య కళాశాలకు పెట్టడం హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, కులస్తులు కనకయ్య, శంకర్, శ్రీకాంత్, ఎ.శ్రీకాంత్, లింగయ్య, పుష్పలత, సునీత, శంకర్, మంగ, ప్రణయ్, భద్రయ్య, శ్యాం, శైలేందర్, సురేష్, మధుకర్, మోహన్, శ్రీనివాస్, ధర్మయ్య, రాంచందర్, తిరుపతి, పి.తిరుపతి, ఏసయ్య, త్యనారాయణ, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

నిధుల మంజూరు అభినందనీయం



ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రెబ్బెనలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.11వేల కోట్లు ఏర్పాటు చేయడం, అలాగే విద్యా శాఖ నుంచి ఆసిఫాబాద్ నియోజకవర్గానికి రూ.200 కోట్లు కేటాయించినందులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీ సర్పంచి గంటుమేర, ముంజం రవీందర్, టౌన్ అధ్యక్షుడు వనమాల మురళి, నాయకులు రవీందర్, మోడెం చిరంజీవి గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఇమ్రాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన 'అరిగెల'



అంజిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆయన సతీమణి గాయత్రిని మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం జూబ్లీ హిల్స్‌లోని హనుమాన్ ఆయలంలో 108 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే హరీష్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వశక్తితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ఏ పనిలో విజయం సాధించాలన్నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమవుతుందన్నారు. సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు అమలు చేసుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మహిళా భాగస్వామ్యం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని అన్నారు. బేటీ పడావో- బేటీ బచావో కార్యక్రమం పదేళ్ల పూర్తి చేసుకుందని తెలిపారు సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ రాబోయే భావితరాలకు మహిళలు ఆదర్శంగా నిలబడాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబ సభ్యులు, సమాజం వారిని గుర్తిస్తుందన్నారు. లోకంలో మహిళ తమ విలువను తెలుసుకోవాలని, ఆత్మనూన్యతా భావాన్ని విడనాడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాపార వేత్తలుగా ఎదిగి తమ కాళ్లపై నిలబడాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా సంఘాల నాయకులు, అధికారులు సబ్ కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు. కాగా బాల రక్ష భవన్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న సావిత్రిని అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణాధికారి మహేష్, సిబ్బంది శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, నసీర్, ఉస్మాన్, నవీన్, యూస్రీరాణి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

రెబ్బెన, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హరియాణాలో ఈ నెల 7 నుంచి 11 వరకు నిర్వహించిన 73వ ఆల్ ఇండియా పోలీస్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన క్రీడాకారులను మంగళవారం పలువురు అభినందించారు. తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడాకారులు కాంస్య పతకం సాధించారని చెప్పారు. రాష్ట్ర జట్టులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెబ్బెన మండల క్రీడాకారులు ఆర్ వెంకటేష్, ఆడె రాజేందర్, పి గోపి పాల్గొన్నట్టు తెలిపారు.

ఉపాధిహామీ పనులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

కాగజ్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులపై కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి విడతలో వంద మందికి ఉపాధి హామీలో చోటు కల్పించేలా చూడాలని సూచించారు. పనులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. గుర్తించిన పనులు చేపడుతూ కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో బుచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

రెబ్బెన, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ రాథోడ్ శేషారావు అన్నారు., రెబ్బెన మండలంలోని నంబాల సబ్ స్టేషన్‌లో తక్కళ్లపల్లి ఫీడర్‌కు కొత్త బ్రేకర్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర సరఫరా చేసేందుకు ఈ సబ్‌స్టేషన్‌లోని కొత్త బ్రేకర్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ వీరేశం, ఏడీఈ ఫిరోజ్‌ఖాన్, సంతోష్, ఏఈ ఇమ్రాన్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. మండలంలోని సవ్వాతి గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువకులకు వాలీబాల్ కిట్‌ను, నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతి రోజు వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు ఆడుకుంటూ క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. విద్యతో పాటు యువత క్రీడల్లో రాణించాలని చెప్పారు. మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడు తాయని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోయం భీం తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బెజ్జూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం కుశ్నపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. పేకాడుతున్న వారి నుంచి రూ.2150 నగదు స్వాధీనం చేసుకుని 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట, జూదం, గంజాయి సాగు వంటి కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుఉంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కాగజ్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను అందజేత మంగళవారం ఎస్సై మహేందర్ బాధితుడికి అందజేశారు. కాగజ్‌నగర్ ఈసుగాం సమీపంలో పట్టణానికి చెందిన కుమార స్వామి వారం రోజుల క్రితం సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. అతడికి ఫిర్యాదు మేరక పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకుంటనే ఫిర్యాదు చేస్తే గుర్తించి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చేయూత

వెంకట్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఏపీఎం: మహిళా సంఘాలకు చేయూతనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ సూచనల మేరకు ఆయా పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. రుణాలు మంజూరు చేస్తే మహిళలు ఆర్థికంగా బలపడేలా పర్యవేక్షిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని మహిళా గ్రుపులు ఉన్నాయి?

ఏపీఎం: మండలంలో మొత్తం స్వయం సహాయక మహిళా సంఘాలు 291 ఉన్నాయి. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు సుమారు 7కోట్ల రుణాలు అందించాం. ప్రతీ నెల 80% శాతం వరకు రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: పెండింగ్ బకాయిల రికవరీకి తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఏపీఎం: పెండింగ్ బకాయిలు వసూలు చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వన్ టైం సెటిల్‌మెంట్ కింద క్లోజింగ్ బ్యాలెన్స్‌లో 75శాతం చెల్లించినట్లయితే మిగితాది మాఫీ చేస్తున్నాం. ఇప్పటి వరకు 80 గ్రూపులు దీన్ని సద్వినియోగం చేసుకున్నాయి. మరో ఎనిమిది మిగిలి ఉన్నాయి.

- సిర్పూర్(యు), ఆంధ్రజ్యోతి

ఎల్ఆర్ఎస్ రాయితీపై విస్తృత ప్రచారం



- మార్చి 31 వరకు ఫీజు చెల్లిస్తే 25 శాతం మాఫీ
- జిల్లాలో 7,699 దరఖాస్తులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై (లేఅవుట్ స్థలాల క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తుదారులకు రాయితీ ఇచ్చినా అనుకున్న స్థాయిలో స్పందన లేకపోవడంతో ప్రభుత్వం దరఖాస్తుదారులకు అవగాహన పెంచే విధంగా విస్తృత ప్రచారం చేపట్టింది. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు అవగాహన పెంచే దిశగా దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని రెండు మున్సిపాలిటీ పరిధిలో 3,529, 335 గ్రామ పంచాయతీల్లో 4,170 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. దీని కోసం ప్రభుత్వం ఈ సూచనలు చేసింది. రిజిస్ట్రేషన్ అయిన ప్లాటు ధరపై ప్రో రేట్ రుసుంతో 14శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట బఫర్ జోన్ ఇతర స్థలాలు క్రమబద్ధీకరణ చేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎల్ఆర్ఎస్ అర్హత పొందిన స్థలం యజమాని సెల్‌ఫోన్‌కు ఎంత డబ్బులు చెల్లించాలో సమాచారం వస్తుంది. ఒక వేళ ఎల్ఆర్ఎస్ దరఖాస్తు తిరస్కరిస్తే సంబంధిత యజమాని ఖాతాలో 10శాతం ప్రాసెసింగ్ రుసుం మినహాయించుకొని జమ చేస్తారు. ఎల్ఆర్ఎస్ ఉంటే స్థలాలు ఆక్రమణకు గిరకావు. భవన నిర్మాణ అనుమతులు సులభంగా వస్తాయి.



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1.800 పైగా దరఖాస్తులు రాగా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, ఆసిఫాబాద్ తదితర మండలాల వారీగా ఇప్పటికే వచ్చిన 3529 దరఖాస్తులు పరిశీలించనున్నారు. అలాగే 335 గ్రామ పంచాయతీల్లో వచ్చిన 4,170 దరఖాస్తుల్లో 1,665 పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు ప్రకటించారు. గతంలో పలు శాఖల వద్దకు వెళ్లి ఎల్ఆర్ఎస్ చేయించుకోవాల్సి వచ్చేదని, ప్రస్తుత స్కీము ద్వారా సులభంగా రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకున్న అనంతరం ఇంటి నిర్మాణం సులభంగా చేసుకోవచ్చని దీంతో పాటు బ్యాంకు రుణం కూడా పొందవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. దాహరణకు ఒక 10 లక్షలు గల ఆస్తి విలువకు సంబంధించిన దానికి రూ. 1.4 లక్షలు అయ్యే రిజిస్ట్రేషన్ ఫీజులో ఎల్ఆర్ఎస్ స్కీము కింద దానిలో నుంచి 25 శాతం రాయితీ ఇస్తారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులన్నీ క్లియర్ చేస్తే ప్రభుత్వానికి ఫీజుల రూపేణ కోట్లాది ఆదాయం సమకూరనుంది. ఆయా జిల్లా స్థాయిలో అధికారులు ఎల్ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

అంజయ్య, మున్సిపల్ కమిషనర్

పది రోజుల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఎల్ఆర్ఎస్ ఆదేశాలతో దరఖాస్తుదారులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. గతంలో మున్సిపాలిటీలో 1,800కు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో చాలా మంది ఎల్ఆర్ఎస్ పూర్తి కాలేదు. ప్రస్తుతం 25 శాతం రాయితీ ఇచ్చేందుకు ఆదేశాలు రావడంతో చర్యలు తీసుకుంటున్నాం. దరఖాస్తుదారులకు వివరాలు తెలియజేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

మంచిర్యాల జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నెన్నెలలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఓ యువకుడు ఉరేసుకున్నాడు. శ్రీరాంపూర్‌లో వివాహం ఇష్టం లేక ఓ యువతి, బెల్లంపల్లి మండలంలోని పెర్కపల్లిలో చదువుకోవాలని తల్లిదండ్రులు చెప్పినందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

అనారోగ్యంతో ఉరేసుకుని యువకుడు..



మహేష్(ఫైల్)

నెన్నెల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన అబ్బార్ల మహేష్ (21) అనే యువకుడు సోమవారం రాత్రి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ కొంత కాలంగా వింతగా ప్రవర్తిస్తున్నాడు. రాత్రుల్లు నిద్రలోంచి ఉలిక్కి పడి లేస్తూ తనకు బతకాలని లేదని చనిపోతానంటూ చెప్పేవాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఓ సారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. రాత్రి వేళ అందరు నిద్రపోయాక ఇంటి నుంచి పారి పోయాడు. మరుసటి రోజు ఉదయం మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. అటువైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తండ్రి విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వివాహం ఇష్టంలేక యువతి ..



సౌమ్య(ఫైల్)

శ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వివాహం ఇష్టంలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్‌లో జరిగింది. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం... కొత్తరోడ్డు ఏరియాలోని లక్ష్మీనగర్‌లో సౌమ్య(22) తన తల్లితో కలిసి నివాసం ఉంటోంది. డిగ్రీ పూర్తి చేసుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. ఇటీవల ఆమెకు పెళ్లి చేయాలని తల్లి నిర్ణయించింది. విషయం తెలుసుకున్న సౌమ్య సోమవారం రాత్రి ఉరి వేసుకుంది. సౌమ తల్లి కీర్తన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థి..

బెల్లంపల్లిరూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన మోటుపలుకుల మనోజ్‌కుమార్ (18) అనే ఇంటర్ విద్యార్థి పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 9న మనోజ్‌కుమార్ ఇంటర్ రెండో సంవత్సరం పరీక్ష రాసి ఇంటికి వచ్చాడు. సెల్‌ఫోన్ చూస్తుండగా పరీక్షల సమయంలో చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన మనోజ్‌కుమార్ ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు.. గమనించిన కుటుంబీకులు బెల్లంపల్లిప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. మనోజ్‌కుమార్ తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

మంచిర్యాల క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఓ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నైతం శ్రీనివాస్‌పై పోక్సో కేసు నమోదు అయినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పట్ల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేశాడని విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలి పారు. శ్రీనివాస్‌పై ఈ నెల 5న రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో అధ్యాపకురాలిని వేధించిన కేసులో కేసు నమోదైనట్లు సమాచారం.

తిరుమలాపూర్ అడవుల్లో అదుపులోకి మంటలు



అడవిలో మంటలను ఆర్పుతున్న అధికారులు

కాసిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ధర్మారావుపేట అటవీ సెక్షన్ పరిధిలోని తిరుమలాపూర్ అడవుల్లో వారం రోజులుగా చెలరేగిన మంటలు మంగళవారం అదుపులోకి వచ్చాయని బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనలో బుగ్గగూడెం బీట్ 327 కంపార్టుమెంట్‌లో అగ్గి రాజుకుందన్నారు. అడవిలోని వెదురు బొంగులు, ఎండిన ఆకుల వల్ల శర వేగంగా మంటలు అడవంతా విస్తరించాయన్నారు. అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎయిర్ బ్లోయర్‌ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారన్నారు. అడవుల సంరక్షణకు అందరు సహకరించాలన్నారు. మంటలను అదుపు చేయడానికి కృషి చేసిన ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్, సిబ్బంది యుగందర్, కుమారస్వామిలను అభినందించారు.

నెలాఖరులోగా పనులు పూర్తవ్వాలి

ఆసిఫాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పంచాయతీ, హౌసింగ్, మండల పరిషత్ అధికారులు, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనుల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికతో నిరంతరం తాగునీరు అందించే విధంగా అధికారులు కృషి చేయాలని చెప్పారు. వేసవిలో గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో ఆస్తి పన్ను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సీఎస్‌సీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని తెలిపారు. లే అవుట్ లేని భూముల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్-2020లో భాగంగా అందిన దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, దస్తావేజులు సరి చూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అర్హత గల వారికి ఇందిరమ్మ ఇళ్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. వేసవి కాలం అయినందున పని ప్రదేశాల్లో కార్మికుల ఆరోగ్య రక్షణ దిశగా ఉదయం, సాయంత్రం వేళలలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్న సమయంలో పనులు చేయించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. నీడ సౌకర్యం కల్పించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నూతన గనులతోనే భవిష్యత్తు

మందమర్రిటౌన్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): నూతన గనులతోనే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య అన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో ఉపాధి అవకాశాల పెంపుదలకై నూతన గనులు తప్పనిసరి అని చెప్పారు. దీని కోసం తమ యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారని తెలిపారు ఇటీవలే గనుల వేలం పాటలో పాల్గొనాలని దక్కించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఏఐటీయూసీతోకలిసి వినతిపత్రాలు సమర్పించారని తెలిపారు.



బొగ్గు బ్లాకుల వేలం పాటలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

బెల్లంపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉన్న బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేసి సింగరేణి సంస్థకు కేటాయించాలని టీఎన్‌టీయుసీ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో మందికి ఉపాధిని ఇచ్చే సింగరేణి సంస్థలో బొగ్గు గనుల వేలం పాటతో ఉపాధి దూరమవుతుం దన్నారు. బొగ్గు బ్లాకుల వేలం పాటపై జాతీయ కార్మిక సంఘాలకు చిత్తశుద్ధి కరువైందన్నారు.. బొగ్గు బ్లాక్‌లన వేలం పాటతో సంబంధం లేకుండా నేరుగా సింగరేణిసంస్థకు కేటాయిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మణి రాంసింగ్, నారాయణ, జీవరత్నం, మల్లయ్య పాల్గొన్నారు.

డోర్లి ఓసీ-2 గనిని పరిశీలించిన అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రెబ్బెన, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో మూత బడిన డోర్లి ఓసీ-2 గనిని మంగళవారం ఓఎస్‌డీ కోల్ కంట్రోల్ అధికారి సందీప్ ఎస్ పరాంజపే, కోల్ కంట్రోల్ ఆఫీస్ కొత్తగూడెం ఓస్‌డీ డీవీ సుబ్రమణ్యం మంగళవారం సందర్శించారు. సమస్యలను జీఎం నరేందర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కెజరామల్లు, ఏరియా అధికారి పాషా, శేఖర్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు వి.తిరుపతి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లోకి 'సింగరేణి'

మందమర్రిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సంస్థ దేశ అవసరాల దృష్ట్యా క్రిటికల్ మినరల్ మైనింగ్‌లోకి అడుగుపెట్టాలని భావిస్తోం దని సింగరేణి సీఎండీ బలరామ్ అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం నిర్వహించిన డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాలుగా ఖనిజాల ఉత్పత్తిలో అంతర్జాతీయ అనుభవం ఉన్నటువంటి ఎన్ఎం డీసీతో కలిసి పని చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. విదేశాల్లో క్రిటికల్ మినరల్స్ ఇతర ఖనిజాల మైనింగ్‌లో ఈసంస్థకు అపారమైన అనుభవం ఉందని తెలిపారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో మేధో విజ్ఞానాన్ని పంచుకునేందుకు ఐఐటీ హైదరాబాద్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సాంకేతికత మానవ వనరులపై ప్రత్యేక ప్రజంటేషన్ కూడ ఇచ్చినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సాకా రంతో చేపడుతున్న సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలను కూడ ఆయన వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్ఎండీసీ ఎండీ అమితావ ముఖర్జీ మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలు తీర్చడంలో సింగరేణి ఖనిజవనరులు జాతికి అందించేందుకు తమ సంస్థ దశాబ్దాలుగా సేవలందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికి సింగరేణికి సహకరించేందుకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో ఎన్ఎండీసీ డైరెక్టర్లు విశ్వనాథ్ సురేశ్ (కమర్షియల్), వినయ్ కుమార్(టెక్నికల్), ప్రియదర్శిని గడ్డం (పర్సనల్), సింగరేణి డైరెక్టర్ ఎల్‌వి సూర్యనారాయణ, డైరెక్టర్ వీపీ వెంకటేశ్వర్లు, ఎండీ సుభాని, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

క్రీడల్లో పాల్గొనాలి

శ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో జయాపజయాలను పట్టించుకోకుండా ఉల్లాసంగా పాల్గొనాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు అన్నారు. సింగరేణిలోని 11 ఏరియాలకు చెందిన ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. శంకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి గరిగెస్వామి, కంపెనీ, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, ఏరియా కార్యదర్శులు, పిట్ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

40 నెలల్లో పనులు పూర్తి చేయాలి

జైపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీ 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ పనులను 40 నెలల్లో పూర్తి చేయాలని సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంటు నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సోమవారం రాత్రి నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్)తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన సీఎండీ బలరామ్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల్లో ప్లాంట్‌ను పూర్తి చేయాల ని ఒప్పందం ఉన్నప్పటికీ 40 నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశామన్నారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెల నుంచే పనులను ప్రారంభించాలన్నారు. ఇచ్చిన షెడ్యూల్‌లోపే పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. బీహెచ్ఈఎల్ జీఎం పార్థసారధి దాస్ మాట్లాడుతూ సింగరేణి పవర్ ప్లాంట్ అతి ముఖ్యమైన ప్రాజెక్టుగా తమ బోర్డు నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు గతంలో చేపట్టిన 1,200 మెగావాట్ల ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను ముందే అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ల్లడించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ, డైరెక్టర్ పీఅండ్‌పీ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్‌మూమెంట్) ఎస్‌డీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల స్ట్రక్చర్ సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకులతో జీఎం కార్యాలయంలో మంగళవారం ఏరియాస్థాయి స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించారు. గుర్తింపు సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీపీలోని జీఎల్ బంకర్, సైట్ ఆఫీసు వద్ద మరుగుదొడ్లు, ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలని చెప్పారు. బైక్ పార్కింగ్ షెడ్‌ను పెంచాలని, శ్రీరాంపూర్ ఏరియాకు 2016లో వచ్చిన క్యాప్ ల్యాంపుల జీవితకాలం ముగిసిందని అన్నారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. ఇందారం 1ఏ వద్ద స్నానపు గదులు, సోలార్ పద్ధతిలో వేడి నీరు అందించాలన్నారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని జీఎం అన్నారు. అంతకుముందు ఇందారం 1ఏ కార్మికుడు రాంచందర్ మృతికి సంతాపకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్ర మంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు టి. శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏజెంట్ రాజేందర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తావని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. సింగరేణి పెన్షనర్లతో బీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. రిటైర్డ్ కార్మికులు ఆయనకు పలు సమ స్యలు విన్నవించారు. సమావేశంలో సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్(బీఎంఎస్) అధ్యక్షుడు పులి రాజారెడ్డి, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి రమాకాంత్, నాగేశ్వర్ రావు, ఆగయ్య, భీమయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో పిలుస్తోంది..



- అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన
- 9వ తరగతి విద్యార్థులకు అవకాశం
- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 23 వరకు గడువు
- వసతి, ప్రయాణం ఉచితం...

కోటపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తుంది. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇది నిర్వహిస్తుండగా ఈ యేడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తుంది. అంతరిక్ష పరిశోధనలో ఇటీవల ఇస్రో ఇటీవల వంద ప్రయోగాలు పూర్తి చేసుకుంది. పలు అగ్ర దేశాలకు ధీటుగా భారత్ పరిశోధనలు చేపడుతుండగా ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో పిలుస్తుంది అనే కార్యక్రమాన్ని చేపట్టింది.

ఈ నెల 23 వరకు గడువు

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుండగా దీని కోసం వెళ్లేందుకు విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా www.isro.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను వడపోసిన అనంతరం ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందుకోసం మే 18నే విద్యార్థులను ఆహ్వానిస్తారు. మే 31న ముగింపు సందర్భంగా కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ఇందుకోసం ఇస్రో దేశ వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతుంది. హైద్రాబాద్(తెలంగాణ), సుళ్లూరుపేట (ఆంధ్రప్రదేశ్), డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం(కేరళ), బెంగుళూరు (కర్ణాటక), షిల్లాంగ్ (మేఘాలయ), అహ్మదాబాద్ (గుజరాత్) కేంద్రాల్లోని ఏదో ఒక కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఇక ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా అందజేస్తారు.


విద్యార్థులకు అవగాహన (ఫైల్)

ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రో జుల పాటు ఇస్రోకు చెందిన స్పే సెంటర్లకు తీసుకు వెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, సప్తగ్రహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తారు.

అర్హులు వీరే...

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. స్పేస్, సైన్స్‌క్లబ్‌లో ఉన్నట్లయితే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ,స్కౌట్ అండ్‌గైడ్స్ విభా గాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం కల్పిస్తారు. ఈ అర్హతలను బట్టి ఎంపిక చేసిన విద్యార్థులకు మే 19 నుంచి 30 వరకు యువికా కార్యక్రమం నిర్వహించనున్నారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములైతే భారత్ చేపడుతున్న పరిశోధనలు, విజ్ఞానం విద్యార్థులకు అందనుంది.



విద్యార్థులకు సువర్ణ అవకాశం: యాదయ్య, డీఈవో, మంచిర్యాల



యువికా ద్వారా విద్యార్థులకు అవకాశం కల్పించడం సువర్ణ అవకాశం. ఆయా పట్టణాల్లోని ఇస్రో ప్రయోగ కేంద్రాల్లో 150 మంది విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తారు. నిపుణులు, శాస్త్రవేత్తలతో అంతరిక్ష విజ్ఞానంపై ప్రత్యక్ష పరిశీలన ద్వారా తరగతులు చూపిస్తారు. ప్రయోగశాలలను చూపించడం వల్ల ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం : మధుబాబు, జిల్లా సైన్స్ అధికారి



ఇస్రో చేపట్టిన ఈ యువికా కార్యక్రమం నూతన ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించ నుంది. తద్వారా భావిశాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇది ఒక సదవకాశం. భారత అంతరిక్ష పరిశోధ నలు, విజయాలు స్వయంగా తెలుసుకుని విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా రూపొందడానికి మార్గదర్శకంగా ఈ కార్యక్రమం నిలుస్తుంది. కాబట్టి తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి ఈ కార్యక్రమానికి రిజిష్టర్ చేసుకుని ఎంపి కయ్యేలా ప్రోత్సహించాలి.

రేషన్ నో స్టాక్..

(5వ పేజీ తరువాయి)

షాపుల చుట్టూ తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితులు నెలకొనగా, షాపుల చుట్టూ తిర గాల్సిన దుస్థితి లబ్ధిదారులకు పట్టింది.

● గడువు పెరిగేనా...?

రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ఈ నెల 15తో గడువు ముగియనుండగా అధికారులు స్పందించి గడువు పెంచాల్సిన అవసరం ఉంది. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం కారణంగా రేషన్ షాపులు ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వ లేక వెలవెలబోతున్నాయి. అధికారుల తప్పిదానికి లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టకుండా సరిపడా స్టాక్ వచ్చి పంపిణీ పూర్తయ్యే వరకు గడువు పెంచాలనే డిమాండ్లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెన్షన్‌లో రూ.16లను కాజేస్తున్న బీపీఎంలు

మందమర్రిరూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్‌లలో మీది రూ. 16లను బీపీఎంలు కాజేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆసంపెల్లి శివకుమార్ మంగళవారం జెడ్పీసీఈవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చే ఆసరా పెన్షన్‌లలో ఒక్కొక్కరికి చెల్లిస్తున్న రూ. 2016, 4016లలో పైన ఉన్న రూ. 16ను బీపీఎంలు ఇవ్వడం లేదని, రూ. 2 వేలు, 4 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెన్షన్‌లలో అవకతవకలకు పాల్పడుతున్న బీపీఎంలు, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు చిలుముల రాజ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఆసంపల్లి అనిల్, ఆసంపల్లి ప్రమోద్, కుమార్, సతీష్ పాల్గొన్నారు.

తాగునీరు ఇవ్వలేదని మహిళ హత్య

నిందితుడి అరెస్ట్..వివరాలు వెల్లడించిన సీఐ



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేకే 1 సీఎస్పీ ఏరియాకు చెందిన పొగిడి రాంబాయి(60) అనే మహిళను తాగునీరు ఇవ్వలేదని అదే కాలనీకి చెందిన కందుల కుమార్ అనే వ్యక్తి సోమవారం రాత్రి గొడ్డలితో నరికి హత్య చేశాడు. మంగళ వారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలను సీఐ శశిధర్‌రెడ్డి వెల్లడించారు. కుమార్ కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5 కాలనీలో కుటుంబంతో వెళ్లి అక్కడే ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం పాత బస్టాండ్ సీఎస్పీ ఏరియాలో నివాసం ఉంటున్న తన తల్లి దగ్గరకు వచ్చాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి రాంబాయి ఇంటికి వెళ్లి తాగునీరు కావాలని అడిగాడు. రాంబాయి కుమారుడు రవికుమార్ నీరు ఇవ్వగా వాటిని తాగి వెళ్లిపోయాడు. మళ్లీ కొద్దిసేపటికి వచ్చి నీళ్లు కావాలని అడగగా లేవని చెప్పడంతో కుమార్ రాంబాయితో గొడవపడ్డాడు. అనంతరం గొడ్డలి తీసుకొచ్చి కుమార్ రాంబాయిపై దాడి చేశాడని తెలిపారు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందిందని తెలిపారు. మృతురాలు కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడిని మంగళవారం టోల్‌గేట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

డాక్టర్ శృతిగోలికి సన్మానం


డాక్టర్ శృతిగోలిని సన్మానిస్తున్న వాసవి వనితి క్లబ్ సభ్యులు

మంచిర్యాల క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వైశ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో డాక్టర్ శృతి గోలిని వాసవి వనిత క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. వైద్య రంగంలో ఉత్తమ సేవలందించినందుకు గాను బర్త్ రూట్ ఆసుపత్రి వైద్యురాలి శృతిగోలిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, సెక్రటరీ గాయత్రి, కోశాధికారి గుండా సునిత, మహిళలు పాల్గొన్నారు.

200 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు

మందమర్రిటౌన్ మార్చి11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తన నియోజకవర్గంలోని కోటపల్లిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 200 కోట్లు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో బుధవారం ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 18శాతం పెంచాలని మాట్లాడుతానని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ సమావేశాల్లో కూడ నియోజకవర్గంలోని మరికొన్ని డిమాండ్లను కూడ ప్రస్తావిస్తానని తెలిపారు. సబ్ ప్లాన్ నిధులను 18శాతం పెంచడం ద్వారా ఎస్సీల ఆర్థిక అభివృద్ధి సాధించే అవకాశాలు ఉంటాయన్నారు.

కాసిపేట చెరువు తూము ధ్వంసం

తాండూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలం కాసిపేట గ్రామంలోని చెరువు తూమును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. సోమవారం ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ గొల్లపల్లి వెంకటేష్ సమాచారం తెలియగానే చెరువు వద్ద కు చేరుకుని చెరువులో నీరు పోకుండా ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. మళ్లీ అదే రోజు సాయంకాలం గుర్తు తెలియని వ్యక్తులు మరొక సారి నీరు పోకుండా అడ్డు వేసిన బస్తాలను తీసివేశారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజన్‌కుమార్, ఇరిగేషన్ వెంకటేష్‌లు సోమవారం రాత్రి సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో జేసీబీ ద్వారా నీరు పోకుండా అడ్డుకట్ట వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. మంగళవారం ఉదయం తాండూర్ మండల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, సీఐ కుమార స్వామి, ఎంపీడీవో శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ రవీందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని చెరువును పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ రవీందర్ తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ఎమర్జెన్సీ రీస్టోర్ టీంల ఏర్పాటు

గర్మిళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల సర్కిల్ పరిధిలో విద్యుత్ అంతరాయం తగ్గించడానికి, పునరుద్ధరణ చర్యలు చేపట్టడానికి ఎమర్జెన్సీ రీస్టోర్ టీం(ఈఆర్‌టీ)లను ఏర్పాటు చేశామని ఎస్ఈ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతికంగా విద్యుత్ సమస్యలు ఏర్పడినప్పుడు ఈఆర్‌టీలు వాహనాల ద్వారా జీపీఆర్ లోకేషన్ పరంగా వేగంగా వెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. వాహనాల్లో థర్మోవిజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్స్ తదితర వస్తువులు ఉంటాయని తెలిపారు. 24 గంటలు ఈఆర్‌టీలు అందుబాటులో ఉంటారని, అంబులెన్స్‌ల తరహాలో వెంటనే లోకేషన్‌కు చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారని తెలిపారు. మెరుగైన విద్యుత్ అందించడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

కాసిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అందరు సహకరించాలని మందమర్రి సీఐ శశిదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పరీక్షలు ప్రశాంతంగా సాగేలా అందరు సహకరించాలన్నారు. ఆయన వెంట కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

ఖాతాదారులు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి


చెక్కు అందిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

దండేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో అకౌంట్స్ ఉన్న ప్రతి ఖాతాదారుడు తప్పకుండా ఇన్స్‌రెన్స్ చేయించుకోవాలని ఆర్‌బిఐ ఎఫ్ఐడిడి డిప్యూటి జనరల్ మేనేజర్ తలకోన జగదీప్‌కుమార్, ఎల్‌డివో తానీయ సంగ్మా కోరారు. దండేపల్లి మండలం లింగాపూర్ చెందిన సోగాల శ్రీనివాస్ గత ఆగస్టులో ఇంటి వద్దనే విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడికి యూనియన్ బ్యాంక్‌లో రూపే డెబిట్ కార్డ్ ఖాతాతో పాటు ఇన్స్‌రెన్స్ కలిగియున్నాడు. దండేపల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సహకారంతో రూ. 2 లక్షల ఇన్స్‌రెన్స్ క్లైమ్‌ను మృతుడి నామినియైన సోగాల వరలక్ష్మికి వారి చేతుల మీదుగా మంగళవారం చెక్కును అందజేశారు. లీడ్ జిల్లా మేనేజర్ తిరుపతి, మేదరిపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, ఏసీ ప్రదీప్, సీసీ రాజశేఖర్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిఎఫ్‌ఎల్ కౌన్సిలర్ హరీష్, రవీందర్ ఉన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

దండేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం నగునూర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు అంబెద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడం దుర్మార్గపు చర్య అని, అవమానించిన ద్రోహులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోళ్ల రాజమల్లు, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు లింగంపల్లి బాపులు డిమాండ్ చేశారు. దండేపల్లిలో మంగళ వారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలుకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే మూలమన్నారు. బాబా సాహెబ్ అంబెద్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోని ముందుగా వెళ్లాలని వారు సూచించారు. అంబేద్కర్‌ను అవమానించిన నిందితులను వెంటనే పట్టుకుని శిక్షించేలా పోలీసు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునవృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అట్రాసీటి జిల్లా సభ్యుడు బచ్చల అంజన్న, నాయకులు గాలిపెల్లి శేఖర్, ఆరేపల్లి రమేష్, జాడి స త్యం, మంతెన నవీన్, బత్తిని జనార్ధన్, కొంగల ప్రవీణ్ పాల్గొన్నారు.


దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న యువకులు

పట్టుబట్టి కొలువులు కొట్టి..

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తిరుమల్


బానోత్ తిరుమల్

కాసిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమగూడెం లంబాడితండాకు చెందిన బానోత్ తిరుమల్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రశంసలు అందుకుంటున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన తిరుమల్‌ను తల్లి శారద అన్ని తానై చదివించింది. దీంతో తిరుమల్ ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ కొలువులు సాధించాడు. పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన తిరుమల్, ఉన్నత చదువులను కాక తీయ యూనివర్శిటీలో పూర్తి చేశాడు. మొదటగా హైద్రాబాద్ ఐఎన్‌సీవోఐఎఫ్‌లో సైంటిస్టు ఆఫీసర్‌గా ఎంపికై 7 ఏండ్లు పనిచేశాడు. అనంతరం హిందూస్తాన్ ఎరోనాటిక్ లిమిటెడ్‌తో పాటు ఇటీవల విడుదలైన ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫార్మ మెటిక్ సర్వీస్)లో ఉద్యోగం వచ్చింది. కానీ ప్రాంతీయ అభిమానం, సింగరేణి సంస్థపై ఉన్న మమకారంతో జైపూర్‌లో సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో మేనేజ్‌మెంట్ అధికారిగా కొనసాగుతున్నాడు. తక్కువ కాలంలోనే ఎక్కువ ఉద్యోగాలు సాధించి అందరి చేత శెభాష్ అనిపించుకుం టున్నాడు. తిరుమల్‌ను కుటుంబీకులు, స్థానికులు అభినందిస్తున్నారు.

వాహనాల తనిఖీ

వేమనపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి నుంచి చెన్నూరుకు వెళ్లే మార్గంలో మంగళవారం నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేమనపల్లి మండలం మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో రామగుండం సీపీ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


శంకర్‌తో కోచ్ శేఖర్

కాసిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెంకు చెందిన యువకుడు గురునాథం శంకర్ ఎంపికైనట్లు కోచ్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది నవంబర్ 25, 26,27 తేదీల్లో మహబూబ్‌నగర్ జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో శంకర్ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఏప్రిల్ 15 నుంచి 21 వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు కోచ్ తెలిపారు. శంకర్‌ను సోమగూడెం ఫుట్‌బాల్ క్లబ్ కోచ్ శేఖర్, క్రీడాకారులు, స్థానికులు అభినందించారు.

71 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం వ్యాన్‌తో పోలీసులు

నస్పూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాంనగర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 71 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. సీసీసీ నస్పూర్ నుంచి కాగజ్‌నగర్ వైపు డీసీఎం వ్యాన్‌లో సోమ వారం బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న పి. శ్రీనివాస్‌తో పాటు డీసీఎం వ్యాన్, బియ్యాన్ని స్వాధీన పర్చుకుని తదుపరి విచారణ కోసం సీసీ సీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్‌కు అప్పగించారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ దాదాపు రూ. 2.77 లక్షల రూపాయల ఉంటుంది.

బాడీ బిల్డింగ్ పోటీల్లో బెల్లంపల్లి యువకుల సత్తా

బెల్లంపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాడీ బల్డింగ్ పోటీల్లో బెల్లంపల్లి స్కై జిమ్‌కు చెందిన యువకులు సత్తా చాటి 8 పతకాలు సాధించినట్లు జిమ్ కోచ్ సదానందం తెలిపారు. 80 కిలోల విభాగంలో లక్ష్మణ్‌కు బంగారు పతకం, మాస్టర్స్ విభాగంలో కృష్ణస్వామికి బంగారు పతకం, 50 కిలోల విభడాగంలో వెండి పతకం సాధించారన్నారు. అలాగే అక్షయ్‌కు 70 కిలోల విభాగంలో బంగారు, జూనియర్స్ విభాగంలో రెండో స్థానం, 55 కిలోలు, జూని యర్స్ విభాగాల్లో రేవంత్‌కు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అలాగే రవి 55 కిలోల విభాగంలో నాలుగో స్థానం, మహేష్, రోహిత్, హ నుమాన్‌లు ఆయా విభాగాల్లో పతకాలు సాధించారని తెలిపారు. కాగా తమ విజయానికి దోహద పడిన స్కై జిమ్ ట్రైనర్‌కు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా మరిన్ని విజయాలు సాధిస్తామని పేర్కొన్నారు.



పతకాలు అందుకుంటున్న బెల్లంపల్లి యువకులు

కంటి వైద్య శిబిరానికి స్పందన

చెన్నూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో మంగళవారం చెన్నూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన 150 మందికి కంటి పరీక్షలు చేయగా ఇందులో 100 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మొదటి విడతలో 45 మందికి కరీంనగర్‌లోని రేకుర్తి వైద్య శాలలో కంటి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నర్సయ్య, కోశాధికారి సాగర్, రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు

5

బుధవారం 12 మార్చి 2025





బీసీ మహిళలకు ఉపకోటా ప్రకటించాలని వినతి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళలకు ఉపకోటా ప్రకటించాలని కోరుతూ మంగళవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కలెక్టరేట్ కార్యాలయం సూపరింటెండెంట్ సంతోష్‌కు వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడతామని పేర్కొంటుందని, ఇందులో బీసీ మహిళలకు 18శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపకోటా ప్రకటించకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు పెడితే అది కేవలం అగ్రకులాల మహిళా బిల్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఉపకోటా ప్రకటించకపోతే మహిళ సమాజం ముందు బీజేపీ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు భీమ్‌సేన్, సతీష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వార సంత వేలం పాట

జన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొనకల్ వారసంతకు ఈనెల 17నవేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధ్యాహ్నం 12గంటలకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల వారు అదేరోజు ఉదయం 9 గంటల నుంచి 12గంటల లోపు రూ. 20వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలంపాట దక్కనివారికి డిపాజిట్ డబ్బుఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రేషన్ నో స్టాక్..

- పంపిణీ గడువు ముగుస్తున్నా షాపులకు చేరని సరుకులు
- చౌక ధరల దుకాణాల చుట్టూ లబ్దిదారుల ప్రదక్షిణ
- ప్రతీ నెలా ఇదే తంతుతో ఇబ్బందికర పరిస్థితులు
- బియ్యం తెప్పించడంలో సివిల్ సప్లయి అధికారుల నిర్లక్ష్యం



మంచిర్యాల, మార్చి11 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసే చౌక ధరల దుకాణాలు స్టాక్ లేక వెలవెలబోతున్నాయి. ప్రతినెల ఒకటి నుంచి 15వ తేదీలోపు రేషన్ షాపుల్లో బియ్యం పోయాల్సి ఉంది. అయితే 12వ తేది వచ్చినప్పటికీ ఇంకా దాదాపు 40శాతం మేరక స్టాక్ చేరుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం ఐదు ఎంఎల్ఎస్(మండల్ లెవెల్ స్టాకిస్ట్ పాయింట్) గోదాముల ద్వారా 424 చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉంది.

ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లు...

చౌక ధరల దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్లు సరిపడా స్టాక్ లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. లబ్ధిదారుల అవసరాలకు సరిపడా బియ్యం మరుసటి నెలకు సంబంధించి నడుస్తున్న నెలలో 25వ తేదీలోపు అందుబాటులో ఉంచాలి. స్టాక్ వివరాల సరి చూసుకొని డీలర్లు ఒకటవ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. మార్చి నెలకు సంబంధించి మరో మూడు రోజులే గడువు ముగిసి ఉన్నా... ఇప్పటి దాక ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి చేరకపోవడం గమనార్హం. ఎప్పటికప్పుడు బియ్యం నిల్వలను సరి చూసుకొని అవసరం మేరకు తెప్పించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల గోదాములు ఖాళీగా కనిపిస్తున్నాయి.

సగ భాగం కొరత...

జిల్లాలోని 424 షాపులకు లబ్ధిదారుల సంఖ్యను బట్టి సగటున ప్రతి నెల 70 క్వింటాళ్ల మేర బియ్యం అవసరం అవుతాయి. అలా జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ షాపులకు సరపరా చేయ డానికి సుమారు 30 టన్నుల సరుకు సరఫరా జరుగాలి. అయితే ఇప్పటి వరకు అందులో కేవలం సగ భాగం మాత్రమే షాపులకు చేరినట్లు తెలుస్తోం ది. మిగితా స్టాక్ కోసం డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పడిగాపులు కాసిన ఫలితం ఉండడం లేదు. దీనితో లబ్ధిదారులకు జవాబు చెప్పలేక షాపులను మూసి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్టాక్ వచ్చినప్పుడల్ల తెరిచి అనంతరం మూసి ఉంచక త ప్పని పరిస్థితులు నెలకొన్నాయని స్వయంగా డీలర్లే చెబుతుండడం గమనార్హం.

తరుచుగా ఇదే తంతు...

గత కొంతకాలంగా రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందని దాఖలాలు ఉన్నాయి. కొన్ని సార్లు ఎంఎల్ఎస్ పాయింట్లలో స్టాకు ఉన్న స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల బియ్యం పంపిణీ కావడం లేదు. సరైన సమయంలో లారీలు అందుబాటులో ఉంచకపోవడంతో ఈ పరిస్థి తులు నెలకొంటున్నాయి. ఇదిలా ఉండగా మరికొన్ని సార్లు అసలు స్టేషన్-1 కాంట్రాక్టర్ వద్దకే పౌర సర ఫరాల శాఖ నుంచి పంపిణీ జరుగడం లేదనే అభి ప్రాయాలు ఉన్నాయి. ఇలా ప్రతి నెల ఏదో తంతు చూపి లబ్ధిదారులను..

(తరువాయి 7లో)

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



జైపూర్ కేజీబీవీలో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్

జైపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని భోజనశాలను పరిశీలించి రోజువారీ మెనును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంట గదులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పదవతరగతి విద్యార్థినీలకు పరీక్షలా ఎలా రాయాలో మెళకువలు, సూచనలు అందించారు. అనంతరం పాఠశాలఆవరణలో నిర్మిస్తున్న కాలేజీభవనాన్ని ఆయన పరిశీలించారు. కిష్టాపూర్, నర్వా, రసూల్‌పల్లి, టేకు మట్ల గ్రామాల్లో చేపడుతున్న జాతీయ రహదారి పనులను పరిశీలించి పురోగతి నుంచి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపురావు, కేజీబీవీ ఎస్‌వో ఫణిబాల, రహదారి కాంట్రాక్టర్లుఉన్నారు.

సరిపడా డ్రిల్ బిట్స్ అందించండి

శ్రీరాంపూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కోల్ కట్టర్ కార్మికులకు సరిపడా డ్రిల్‌బిట్స్ అందించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఆర్‌కే-5 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. నాసిరకమైన డ్రిల్‌రాడ్స్, బోల్టర్‌బిట్లు అందిస్తున్నారని, ఎస్‌డీఎల్ కార్మికులకు డస్క్ మాస్కులు అందించడం లేదని, పనిస్థలాల్లో పనిముట్లు, పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. మూడు, నాలుగు రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి నర్సయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, జీఎం చర్చల కమిటీప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్‌కార్యదర్శి గునిగంటి నర సింహారావు, సహాయకార్యదర్శి సత్తిరెడ్డి ఉన్నారు.

విద్యార్థినులకు కళ్లద్దాలు అందజేత



విద్యార్థినులకు కళ్లదాలు అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో

గర్మిళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాలలో 20మంది విద్యార్థినులకు మంగళవారం కలెక్టర్ కుమార్‌దీపక్ కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి సమస్యతో బాధపడు తున్న విద్యార్థులకు పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 568 పాఠశాలల్లోని 164 రెసిడెన్షియల్ పాఠశాలల్లో8 ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా కంటి పరీక్షలను నిర్వహించి 1274 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు అనిత, యశ్వంతరావు, అశోక్, ప్రసాద్, శ్వేత, శంకర్, బుక్కా వెంకటేశ్వర్, ప్రిన్సిపల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాటి, ఈత చెట్లను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల గౌడ సంఘ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్

జన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందన్ పల్లి, చింతలపల్లె గ్రామాల్లో తాటి, ఈత చెట్లను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల గౌడసంఘ అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందన్ పల్లిలో గీత కార్మికులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లా డారు. తాటి, ఈత చెట్లను తొలగించి నాలుగు రోజులు గడుస్తున్నా ఆబ్కారీశాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయ మన్నారు. ఈత, తాటి చెట్లను రంపంతో కోసి తొలగించడంతో గీత కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. చెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు, ఆబ్కారీ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

భీమిని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని మంచిర్యాల ఎస్ఈ గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విదుత్ ఉపకేంద్రంలో 11కేవీ ఫీడర్‌ను కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రాంభించారు. భీమిని, వడాలగ్రామాలకు వేరువేరు ఫీడర్‌లను ప్రారంభించి అంతరాయం లేకుండా ఉండేందుకు రెండు ఫీడర్‌లను ప్రారంభించారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు యంత్రాంగం పని చేస్తుందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందనే అంచనాలతో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ కైసర్, ఏడీఈ రవికుమార్, ఏఈ రాజనర్సు పాల్గొన్నారు.



భీమినిలో కొత్త ఫీడర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- సీఎం , ఎమ్మెల్యేలకు క్షీరాభిషేకం

బెల్లంపల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఫొటోలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఇంటర్ గ్రేటెడ్ పాఠశాలల కోసం 200 కోట్ల రూపాయల నిధులను బెల్లంపల్లికి మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కృషితోనే నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుం దని పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ పాఠశా లలో మెరుగైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు నెల్లి రమేశ్, యాదగిరి, విజయ్ పాల్గొన్నారు.

చెన్నూరు : మండలంలోని సోమనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో కాంప్లెక్స్ భవనాల నిర్మాణం కోసం రూ. 200 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జా రీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో పాటు ఎమ్మెల్యే గడ్డం వి వేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చిత్రపటాలకు మంగళవారం కాం గ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధి కి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



సీఎం, ఎమ్మెల్యే ఫొటోలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాసిపేట : బెల్లంపల్లి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కతో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం కాసిపేటలో పాలాభిషేకం చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే లక్ష్యం

జన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభు త్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 97మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, ఐదుగురికి షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడ పడుచులకు కల్యాణలక్ష్మీ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుం దన్నారు. సకాలంలో చెక్కులను బ్యాంకులో జమ చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముజాఫర్ ఆలీ, సయ్యద్ పసివుల్లా, ఇందయ్య, సతీష్, కరుణాకర్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జనావాసాల నుంచి డంప్‌యార్డును తరలించండి

- సింగరేణి ఉద్యోగుల వినతి



మాజీ మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సింగరేణి ఉద్యోగులు

శ్రీరాంపూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సీసీసీలోని జనావాసాల మధ్య ఉన్న డంప్‌యార్డును అక్కడి నుంచి తరలించాలని సింగరేణి ఉద్యోగులు ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగుల క్వా ర్లర్ల మధ్యలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వెనుకవైపు డంప్‌యార్డు ఉండడంతో తీవ్ర దుర్గంధం వస్తోం దని, తరచుగా చెత్తను తగులబెట్టడంతో పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని తెలిపారు. పది కిలోమీటర్ల పరిధిలో ఇళ్లల్లో నివాసం ఉండేవారికి శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని, అస్తమా ఉన్న వారు గాలి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌కే-5 కాలనీ, టీచర్స్ కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, శ్రీరాంపూర్ కాలనీ, నస్పూర్ కాలనీ, బి-టౌప్ క్వార్టర్లు, బంగ్లాస్ ఏరియా, ఆర్‌కే-8 కాలనీ క్వార్టర్స్, ఇతర కార్మిక నివాసం ప్రాంతాలలో తీవ్ర ప్రభావం చూపుతున్నదని వివరించారు.

గ్రూప్-2లో సత్తా చాటిన యువకులు

గంపలపల్లి వాసికి రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంక్



గొడ్డేటి అశోక్ (ఫైల్)

లక్సెట్టిపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-2 ఫలితాలను మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని గంపలపల్లి వ్యవసాయ కుటుంబానికి చెందిన గొడ్డేటి అశోక్ రాష్ట్రస్థాయిలో 7వర్యాంక్ సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అశోక్ ఇప్పటికే 3ఉద్యోగాలు సాధించాడు. గొడ్డేటి కిష్టయ్య, దేవక్కలకు ముగ్గురు సంతానం. అందులో రెండవ కొడుకు అశోక్ గతంలో అటవీశాఖలో ఎఫ్‌బీవోగా అదే విధంగా పంచాయితీ సెక్రెటరీ పనిచేసి ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయంలో అకౌంట్స్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఫలితాల ద్వారా తనకు డిప్యూటి తహసీల్దార్ ఉద్యోగానికి ఎంపికయ్యే అవకాశం ఉందన్నాడు.

నెన్నెల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌పీఎస్సీ మంగళవారం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో మండలంలోని ఆవడం గ్రామానికి చెందిన చీర్ల సురేష్‌రెడ్డి, మందల సుమంత్‌గౌడ్‌లు సత్తాచాటారు. చీర్ల లక్ష్మయ్య-రమక్కల రెండో కుమారుడు సురేష్ రెడ్డి 55వ ర్యాంకు సాధించాడు. సురేష్ ప్రస్తుతం సింగరేణి సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. మందల మురళీధర్ కొడుకు సుమంత్‌గౌడ్ 172వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. సుమంత్ జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రూప్-2లో ర్యాంకులు రావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన యువకులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.